క్లుప్తంగా

రక్షణ గోడ నిర్మించాలి

కర్నూలు(రూరల్): స్థానిక శ్రీరామ్ నగర్, లక్ష్మి నగర్‌ల వెంట ఉన్న సుద్దవాగుకు రక్షణ గోడ నిర్మించాలని సీపీఎం నగర కార్యవర్గ సభ్యులు నరసింహులు డిమాండ్ చేశారు. గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షాలకు సుద్దవాగులోని నీరు ఆయా కాలనీల రోడ్లపైకి, ఇళ్లలోకి చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి రక్షణ గోడ నిర్మించి కాలనీ వాసుల కష్టాలు తీర్చాలన్నారు.

బాబు ఆదేశాలతోనే పోలీసులపై దాడులు

కర్నూలు(రాజ్‌విహార్): టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాలతోనే చిత్తూరు జిల్లాలో పోలీసులపై దాడులు జరిగాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాస్‌చంద్ర బోస్ ఆరోపించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పుంగనూరు ఘటనకు బాబే కారణమన్నారు. పోలీసుల తలలు పగులగొట్టిన టీడీపీ నేతలపై కేసులు పెట్టుకుండా సన్మానం చేయాలా అని ప్రశ్నించారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో 14 ఏళ్లు సీఎంగా ఉండి అనేక దుర్మార్గాలకు పాల్పడిన చంద్రబాబు.. ఇప్పుడు రాష్ట్ర అభివృద్ధిని కూడా అడుగడుగునా అడ్డుకుంటున్నారన్నారు. యాత్రల పేరుతో షికార్లు చేస్తూ రాష్ట్రంలో అశాంతి నెలకొల్పుతున్నారన్నారు. దేశంలో అత్యధికంగా ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాత్రమే అన్నారు. ప్రభుత్వం పట్ల ప్రజల మద్దతు రోజురోజుకు పెరిగిపోతుండడంతో జీర్ణించుకోలేక అల్లర్లు సృష్టించే పనిలో చంద్రబాబు ఉన్నారన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు ధనుంజయ ఆచారి, లక్ష్మీకాంతయ్య, మురళీనాయుడు పాల్గొన్నారు.

విద్యార్థి బస్సును నడపాలి

కర్నూలు(సెంట్రల్): గుండ్రేవుల నుంచి సి.బెళగల్‌కు విద్యార్థి బస్సును నడపాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరారు. గురువారం గుండ్రేవులకు చెందిన పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కలెక్టరేట్ చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. సమస్యను కలెక్టర్‌కు వివరించే ప్రయత్నం చేయగా ఆమె అందుబాటులో లేక పోవడంతో నిరాశగా వెనుదిరిగారు. గుండ్రేవుల నుంచి సి.బెళగల్‌లకు అనేక మంది విద్యార్థులు ఉన్నత చదువుల కోసం రాకపోకలు సాగిస్తున్నారన,ఇ బస్సులు లేకపోవడంతో సమయానికి స్కూళ్లు, కాలేజీలకు చేరుకోలేకపోతున్నామని విద్యార్థులు వాపోయారు.

14న ఆట, పాట కార్యక్రమం

కర్నూలు(రూరల్): మండల, పట్టణ కేంద్రాల్లో ఈనెల 14న ఆట, పాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం కార్మిక, కర్షక భవనంలో ఏర్పాటు చేసిన ఏఐఏడబ్ల్యూయూ, సీఐటీయూ, ఏఐకేఎస్ సంయుక్త సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తున్న మోదీని గద్దెదించుదాం - దేశాన్ని కాపాడుకుందాం నినాదంతో 14న సాయంత్రం నుంచి రాత్రి వరకు నిర్వహించే ఆట, పాట కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణ, అంజిబాబు, ఏఐఏడబ్ల్యూయూ జిల్లా కార్యదర్శి కేవీ నారాయణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కర్నూలు(అర్బన్): నగరంలోని ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు అమర్, సాయి ఉదయ్ గురువారం సాంఘిక సంక్షేమ శాఖ పర్యవేక్షకులు శివారెడ్డికి వినతి పత్రం అందించారు. బీసీ వసతి గృహాలకు గదులు సరిగా లేకపోవడం వల్ల రేకుల షెడ్లలో కొనసాగుతున్నందున వర్షం నీరు గదుల్లోకి చేరి విద్యార్థుల చదువుకు ఆటంకం ఏర్పడుతోందని వివరించారు. పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో విద్యార్థులు అనారోగ్యాలకు గురవుతున్నారని, రెండు ఎస్సీ వసతి గృహాల విద్యార్థులను ఒకే భవనంలో ఉంచడం వల్ల భోజనం కూడా సరిపోవడం లేదని పర్యవేక్షణ చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

షాదీ తోఫా నిబంధనలు సడలించాలి

కర్నూలు(రూరల్): రాష్ట్ర ప్రభుత్వ షాదీ తోఫా పథకానికి పెట్టిన నిబంధనలను సడలించాలని అవాజ్ కమిటీ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఇక్బాల్, షరీఫ్ గురువారం సంయుక్త ప్రకటనలో కోరారు. విద్యార్హత పదో తరగతి, 300 యూనిట్ల విద్యుత్ నిబంధనలను తొలగించి, వివాహం జరిగి తర్వాత సంవత్సరం వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించాలని, అలాగే రూ.50 వేలను రూ.లక్షకు పెంచాలని కోరారు.

కేంద్రం నిధులు పక్కదారి

కర్నూలు కల్చరల్: కేంద్ర ప్రభుత్వ నిధులను పక్కదారి పట్టిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణ పాఠం తప్పదని బీజేపీ నేత, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ హెచ్చరించారు. గ్రామ పంచాయతీ నిధులు, సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణకు బీజేపీ, జనసేన ఆధ్వర్యంలో గురువారం ధర్నా చౌక్‌లో మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యం చేసేందుకు బీజేపీ, జనసేన కలిసి పోరాటాలు చేస్తాయన్నారు. వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తాయన్నారు. అనంతరం డీఆర్వో నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రామస్వామి, ప్రధాన కార్యదర్శులు కాళింగి నరసింహ వర్మ, కాశీ విశ్వనాథ్, క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ కపిలేశ్వరయ్య పాల్గొన్నారు.

అర్చకులకు 'అభయం'

- పూజారులకు వరాలు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆలయ ఉద్యోగులకు రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంపు
- ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం
- ఓపిక ఉన్నంత వరకు అర్చకత్వం చేసుకునేలా నిర్ణయం
- హర్షం వ్యక్తం చేస్తున్న అర్చకులు, ఉద్యోగులు



శ్రీశైల ఆలయం (ఫైల్)

కర్నూలు కల్చరల్: ఆలయాల అర్చకులపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచినట్లుగానే దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా గరిష్ట వయసు 62కి పెంచుతూ నిర్ణయాన్ని ఆమోదించింది. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఏడాది జులై 12 నుంచి ఇది వర్తించనుంది. దీనిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే నెల రోజుల్లో తెలపాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. అలాగే అర్చకులు ఓపిక, శక్తి ఉన్నంత వరకు భగవంతుడి సేవలో కొనసాగేలా ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయానికి ఆమోదం తెలిపింది. అయితే ఈ రెండు నిర్ణయాలపై దేవదాయ శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే కసరత్తు మొదలు పెట్టారు. ఈ మేరకు ఉమ్మడి దేవదాయ శాఖ అధికారులు, పలు ప్రముఖ ఆలయాల ఈఓలు అర్హుల జాబితా ఉన్నతాధికారులకు పంపే పనిలో నిమగ్నమయ్యారు. సీఎం వైఎస్ జగన్ తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

1,800 మంది అర్చకులకు లబ్ధి

ఉమ్మడి జిల్లాలో సుమారు 3857 ఆలయాలు ఉన్నాయి. ఇందులో దేవదాయ శాఖ పరిధిలో సుమారు 340 ఆలయాలు ఉన్నాయి. ఆలయాల్లో అర్చకత్వం చేసే అర్చకుల వారసులకు ఇటీవల వంశపారంపర్య అర్చక హక్కులను కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. సుమారు 1,800 మంది అర్చకులకు లబ్ధి చేకూరనుంది. అలాగే వివిధ ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకుల రిటైర్మెంట్ లేకుండా చట్ట సవరణ చేసేలా కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. దీంత వీరికి ఓపిక, శక్తి ఉన్నంత వరకు అర్చకత్వం చేసుకునే అవకాశం దక్కనుంది. అర్చకులకు సంబంధించిన నిర్ణయాలపై త్వరలో మార్గదర్శకాలను దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయం విడుదల చేయనుంది. శ్రీశైలం, మహానంది, ఉరుకుంద, యాగంటి, మద్దిలేటి స్వామి దేవస్థానం, కాల్వబుగ్గ, అహోబిలం తదితర ఆలయాల్లో 540 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. పదవీ విరమణ వయసు పెంచడంతో వీరు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండేళ్లు పెంచడం సంతోషం



ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 60 నుంచి 62 ఏళ్లకు పదవీ విరమణ వయస్సును పెంచడం సంతోషం. మహానంది దేవస్థానలలో 63 మంది ఉద్యోగులు ఉన్నారు. వారిలో నలుగురు ఈనెలలో ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో రెండేళ్లు అదనంగా సర్వీసు పెరిగింది. దీంతో ఆ కుటుంబాలకు అండగా నిలిచినట్లైంది.

– చందూరి రవిశంకర అవధాని,అధ్యక్షులు, మహానంది దేవస్థానం ఉద్యోగులసంక్షేమం సంఘం

అర్చకులకు అండగా..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటూ అర్చకులకు అండగా నిలుస్తున్నారు. రూ.5 లక్షల లోపు ఆదాయం ఉన్న ఆలయాలను అర్చకులే నిర్వహించుకునేలా ఆదేశాలు జారీ చేయడం, అర్చకులకు రిటైర్మెంట్ లేకుండా చట్ట సవరణ చేయడం, అర్చకులకు వేతనాలు పెంచడం, 439 జీఓ ద్వారా అర్చకులకు వంశపారంపర్య హక్కు కల్పించడం, ఆలయాల ఆస్తులు ఆక్రమణకు గురైతే నోటీసులు ఇచ్చి వెంటనే స్వాధీనం చేసుకునేలా ఆర్డినెన్స్ జారీ చేయడం లాంటి చరిత్రాత్మక నిర్ణయాలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది. అర్చకుల తరపున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– కోటపాడు శ్రీనివాసులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ అర్చక సమాఖ్య

చరిత్రాత్మక నిర్ణయం



దేవాలయాల్లో అనువంశిక హక్కులు కొనసాగేలా నిర్ణయించడంతో పాటు ఓపిక, శక్తి ఉన్నంత వరకు ఆలయాల్లో పని చేసేలా అర్చకులకు రిటైర్మెంట్ లేకుండా చట్ట సవరణ చేసేలా నిర్ణయించడం నిజంగా చారిత్రాత్మకమే. దీంతో ఆలయాల్లో దేవుళ్లకు ఆగమ శాస్త్రాల ప్రకారం నిత్య పూజలు, అర్చనలు చేసే సంప్రదాయం కొనసాగనుంది. ఏది ఏమైనా ఇచ్చిన మాట ప్రకారం నిర్ణయాన్ని అమలు చేయడం గొప్ప విషయం. ముఖ్య మంత్రికి భగవంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయి.

– నందేల్ చంద్రశేఖర్ శర్మ, ఉపాధ్యక్షులు, ఆపన్న బ్రాహ్మణ సేవా సమాఖ్య సంఘం

20న యోగ జట్ల ఎంపిక పోటీలు

కర్నూలు(రూరల్): ఈనెల 20న నగరంలోని ఔట్ డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి యోగ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యోగా సంఘం కార్యదర్శి అవినాష్ శెట్టి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారిని సెప్టెంబర్ రెండోవారం కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్ కార్డ్, పాస్‌ఫొటోలతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 9247400100 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రైతులకు పూర్తి పరిహారం ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): ఏపీఐఐసీ కోసం భూములిచ్చిన రైతులకు పూర్తి పరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో బాధిత రైతులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చారు. ఆమె అందుబాటులో లేక పోవడంతో కలెక్టరేట్ ఏఓకు అందించారు. ఓర్వకల్లు మండలం కొమరోలు దళితుల భూములను సేకరించిన ఏపీఐఐసీ పూర్తి పరిహారాన్ని ఇవ్వడంలేదని, ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు.

డిగ్రీ పరీక్షలకు 491 మంది గైర్హాజరు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ 2వ సెమిస్టర్ పరీక్షలకు 4,934 మందికి గానూ 4,443 మంది విద్యార్థులు హాజరయ్యారని, మిగతా 491 మంది గైర్హాజరయ్యారని గురువారం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎ.ఆనందరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా కర్నూలు డిగ్రీ కళాశాల(పురుషుల)లో ఒకరు డిబార్‌ైనట్లు వీసీ తెలిపారు.

ఆల్బెండజోల్ మాత్రలు వేయించండి

- నగర మేయర్ బీవై రామయ్య



విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్ర మింగిస్తున్న నగర మేయర్ బీవై రామయ్య

కర్నూలు(హాస్పిటల్): చిన్నారులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని నగర మేయర్ బీవై రామయ్య సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా గురువారం సి.క్యాంపులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కడుపులో నులిపురుగుల వల్ల రక్తహీనత, ఆకలి లేకపోవడం, అలసట, కడుపునొప్పి, వికారం, విరేచనాలు, బరువు తగ్గడం వంటి అనారోగ్య సమస్యలతో చిన్నారులు బాధపడతారన్నారు. నులిపురుగులను నియంత్రించేందుకు ఆల్బెండజోల్ మాత్రలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్, మాస్ మీడియా అధికారి ప్రమీలాదేవి, కార్పొరేటర్ పల్లవి, మున్సిపల్ హైస్కూల్ హెడ్‌మాస్టర్ మహేష్, ఆర్‌బీఎస్‌కే మేనేజర్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా

కర్నూలు సిటీ: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 12న కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న 12 గంటల ధర్నాకు తరలిరావాలని ఫ్యాప్టో జిల్లా కమిటీ చైర్మన్ ఎస్.గోకారి, సెక్రటరీ జనరల్ గట్టు తిమ్మప్ప ఉపాధ్యాయులను కోరారు. గురువారం సలాంఖాన్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రాథమిక విద్య వ్యవస్థను నిర్వీర్యం చేసే జీఓ 117ను వెంటనే రద్దు చేయాలని, రెండు నెలలుగా పెండింగ్ ఉన్న బదిలీ ఉపాధ్యాయుల వేతనాలు విడుదల చేయాలనే తదితర డిమాండ్లతో ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఫ్యాప్టో నాయకులు శ్రీధర్, గోవింద్ నాయక్, దేవదాస్, మరియానందం, సుధాకర్, జయరాజు, వై.నారాయణ పాల్గొన్నారు.

పంచప్రాణ్ ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, వర్సిటీ సిబ్బంది

కర్నూలు (న్యూసిటీ): కేంద్ర యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఉర్దూ యూనివర్సిటీలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నా దేశం- నా భూమి కార్యక్రమంలో భాగంగా గురువారం పంచప్రాణ్ ప్రతిజ్ఞ చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జెఎండీ షఫీ మాట్లాడుతూ దేశ సమగ్రాభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

కుళ్లిపోయిన పిత్తాశయం

- ఆపరేషన్ ద్వారా తొలగింపు



ఆపరేషన్ చేయించుకున్న నాగార్జునతో వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): పిత్తాశయం(గాల్‌బ్లాడర్)లో రాళ్లు ఏర్పడినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసిన ఓ వ్యక్తికి అది కుళ్లిపోయి కడుపులోనే గ్యాంగ్రిన్‌గా మారింది. ఈ పరిస్థితుల్లో అతనికి కర్నూలులోని అమీలియో హాస్పిటల్ వైద్యులు విజయవంతంగా ఆపరేషన్ చేశారు. వివరాలను గురువారం ఆసుపత్రి అధినేత డాక్టర్ లక్ష్మీప్రసాద్ వివరించారు. 'అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన నాగార్జున(59) ప్రభుత్వ ఉపాధ్యాయుడు. కొంత కాలంగా బీపీ, షుగర్, గుండెజబ్బుతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో అతనికి పిత్తాశయంలో రాళ్లు ఏర్పడ్డాయి. చికిత్స తీసుకోకుండా నొప్పి మాత్రలు వాడుతూ కాలం వెళ్లదీస్తూ వచ్చాడు. గత నెల 23న తీవ్రమైన కడుపునొప్పితో మా ఆసుపత్రిలో చేరాడు. 24న జనరల్ సర్జన్ డాక్టర్ కె.రామచంద్రయ్య, అనెస్తెటిస్ట్ డాక్టర్ శిల్ప కలిసి శస్త్రచికిత్స నిర్వహించారు. అనంతరం ఐసీయూలో రెండు రోజుల పాటు వెంటిలేటర్‌పై ఉంచి ఇంటెన్సివిస్ట్ డాక్టర్ శ్రీధర్ పర్యవేక్షించారు. వారం రోజులకు నాగార్జున కోలుకున్నాడు' అని ఆయన వివరించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ ప్రజలకు సూచించారు. గురువారం ఆయన స్థానిక 45వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన లేబర్ కాలనీ ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. స్థానికంగా గుర్తించిన సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని, వాటిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏ అవసరమొచ్చినా వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పార్టీ నాయకులు ప్రభుదాస్, జమ్మన్న, భాస్కర్‌రెడ్డి, ఇర్ఫాన్, సాధిక్, జోషి, చందు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

కర్నూలు (టౌన్): అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మున్సిపల్ అధికారులకు సూచించారు. గురువారం నగరపాలకలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్‌ను ఎమ్మెల్యే కలిసి అభివృద్ధి పనులపై చర్చించారు. ఇంజినీర్లు, సచివాలయాల సిబ్బందితో సమావేశాలు ఏర్పాటు చేసుకొని అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఎమ్మెల్యే సూచించారు. ఓటర్ల సర్వేపై మరింత ప్రచారం చేయాలన్నారు. ఇంటింటికి వెళ్తున్న బీఎల్‌ఓలు, సర్వే టీమ్‌లు బోగస్ ఓట్లను గుర్తించాలన్నారు. పలుచోట్ల లెక్కకు మించి ఓట్లు ఉన్నాయని, వాటన్నింటిని తొలగించాలని సూచించారు.

నర్సింగ్ విద్యార్థిని అదృశ్యం

కర్నూలు (హాస్పిటల్): స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆవరణంలో ఉన్న ప్రాంతీయ శిక్షణా కేంద్రం (ఫీమేల్) ఎంపీహెచ్‌ఏ కోర్సు ద్వితీయ సంవత్సరం విద్యార్థిని అదృశ్యమయ్యింది. బుధవారం ఉదయం ఆమె శిక్షణా కేంద్రం నుంచి వెళ్లిపోయినట్లు అధికారులు గుర్తించారు. గతంలోనూ ఈ విద్యార్థిని హాస్టల్ నుంచి వెళ్లిపోయి తిరిగి రావడంతో అప్పటి అధికారులు మందలించి లేఖ రాయించుకున్నారు. తిరిగి బుధవారం ఉదయం వెళ్లిపోవడంతో అధికారులు తీవ్రంగా గాలించారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

15న 'పడమటి గాలి' ప్రదర్శన

కర్నూలు కల్చరల్: ఈనెల 15న కర్నూలులో 'పడమటి గాలి' సాంఘిక నాటకాన్ని పదర్శించనున్నట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు అమ్మవారికి పూజలు

కర్నూలు కల్చరల్: అధిక శ్రావణ మాసం పురస్కరించుకుని ఓల్డ్‌సిటీ పూల బజార్‌లోని చిన్న అమ్మవారి శాలలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు అమ్మవారికి 33 రకాల పిండి వంటలతో నైవేద్యం, 33 రకాల దీపాలతో హారతులు, 33 సంకీర్తనల అర్చన, మధ్యాహ్నం మహా మంగళ హారతి కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

రోగులకు నాణ్యమైన ఆహారాన్ని వడ్డించాలి



ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాల రోగులకు నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన ఆసుపత్రిలోని ఆహార విభాగాన్ని తనిఖీ చేశారు. ఆహార పదార్థాలు, కూరగాయలు, ఇతర సామగ్రిని పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం గ్యాస్ట్రో ఎంట్రాలజీ, గైనకాలజీ, చిన్నపిల్లల విభాగాలను సందర్శించి మరమ్మతులు అవసరమైన చోట వెంటనే పనులు ప్రారంభించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్‌ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్ తదితరులు ఉన్నారు.

మందుబాబులకు జైలు శిక్ష

కర్నూలు: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ముగ్గురికి ఒక్కొక్కరికి రెండు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో కర్నూలు శివారులోని సుంకేసుల రోడ్డులో సంజీవని హాస్పిటల్ వద్ద బుధవారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. కర్నూలుకు చెందిన మధు, ఖాశీం బాషా, సామేలు మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరిని గురువారం కోర్టులో హాజరుపర్చగా జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పడంతో పంచలింగాల సబ్ జైలుకు తరలించారు.

డాక్టరేట్ ప్రదానం



జి.సునీత

కర్నూలు సిటీ: కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీ కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలు జి.సునీతకు రాయలసీమ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. శ్రీకృష్ణదేవరాయల యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్.గీతాంజలి పర్యవేక్షణలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో 'డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఫీచర్ సెలక్షన్ అండ్ క్లాసిఫికేషన్ అల్గారిథమ్స్ ఫర్ మల్టిపుల్ డిసీజ్ డయాగ్నోసిస్' అంశంపై చేసిన పరిశోధనలకు తనకు డాక్టరేట్ వచ్చిందని సునీత గురువారం తెలిపారు.

ఆదాయం పెంపు దిశగా అడుగులు

- పలు అంశాలకు ఆమోదం తెలిపిన స్టాండింగ్ కమిటీ
- ఆరోగ్య సహాయకుల పదోన్నతులకు లైన్ క్లియర్
- 176 మంది పారిశుధ్య ఉద్యోగులకు వాకీటాకీలు
- స్టాండింగ్ కమిటీ సమావేశంలో మేయర్ బీవై రామయ్య



స్టాండింగ్ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్): నగర పాలక ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు ఆదాయం పెంపు దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు మేయర్ బీవై రామయ్య తెలిపారు. అభివృద్ధి, ఆదాయం తమ ఎజెండా అన్నారు. గురువారం నగరపాలకలోని మేయర్ చాంబర్‌లో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ, అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు కైపా పద్మలతా రెడ్డి, జీఎల్‌వీ సుజాత, నగరూరు శ్రీనివాసరావు, ఆత్మకూరు నాగలక్ష్మి రెడ్డి, సంగాల సుదర్శన్ రెడ్డి, నగరపాలక సంస్థలోని వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. అనంతరం స్టాండింగ్ కమిటీలో 9 అంశాలపై చర్చించి ఆమోదం తెలిపారు.

ఆమోదం తెలిపిన అంశాలు

- నగరపాలక సంస్థ పరిధిలోని 19వ వార్డు నంద్యాల చెక్‌పోస్టు నుంచి సాయి వైభవ్ ఆర్చ్ వరకు రూ.80 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి ఆమోదం
- 20వ వార్డు ధనలక్ష్మి నగర్‌లో రూ.49.95 లక్షలు వెచ్చించి రోడ్లు వేసేందుకు ఆమోదం.
- నగరపాలక సంస్థలో ఆరోగ్య సహాయకులుగా పనిచేస్తున్న బి.అంజనేయులు, రమేష్‌బాబు, ముర్తుజావలీ, ఆర్.రాజు, ముని స్వామి, కె.రమణరెడ్డిల సీనియారిటీ జాబితాను ఖరారు చేశారు. త్వరలో వీరికి పారిశుధ్య తనిఖీదారులుగా పదోన్నతులు కల్పించనున్నారు.
- మున్సిపల్ షాపులు, లీజు బకాయిలు చెల్లించని 16 షాపులకు బహిరంగ వేలం వేయనున్నారు.
- పాతబస్టాండ్‌లోని నగరపాలక సంస్థ స్థలాన్ని 20 ఏళ్లపాటు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు లీజుకు ఇస్తూ ప్రతినెల రూ.42 వేలు బాడుగతో పాటు ఏటా 33.33 శా అద్దె పెంచేందుకు అంగీకరించారు.
- కల్లూరు పంచాయతీ, మునగాలపాడు, స్టాంటన్ పురం, లక్ష్మీపురం, పందిపాడు, పెద్దపాడు గ్రామాల పంచాయతీలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందుకు రెండు నెలల పాటు ఏజెన్సీ ద్వారా 180 మంది కంటింజెంట్ వర్కర్లను నియమించేందుకు వేతనాల కింద రూ.50 లక్షలు సాధారణ నిధులను కేటాయించేందుకు కమిటీ అంగీకారం తెలిపింది.
- పారిశుధ్య విభాగంలో క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్న 176 మంది తనిఖీదారులు, వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులకు రూ.49.90 లక్షలు వెచ్చించి సిమ్ బేస్డ్ వాకీటాకీలు కొనుగోలు చేసుకునేందుకు ఆమోదం తెలిపారు.

రేపు సమూహా ఆవిర్భావ సభ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

కర్నూలు కల్చరల్: ఈనెల 12న హైదరాబాద్‌లో సమూహా ఆవిర్భావ సభ జరుగుతుందని విరసం రాష్ట్ర నాయకులు పాణి అన్నారు. గురువారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో సమూహా ఆవిర్భావ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో విచ్ఛిన్నకర శక్తులు వివిధ రాష్ట్రాల్లో హింసను ప్రోత్సహిస్తూ దేశ సమగ్రతను దెబ్బతీస్తున్నాయన్నారు. వర్తమాన కాలంలో ప్రగతిశీల కవుల పాత్ర కీలకమైందన్నారు. తమ రచనలు, సభల ద్వారా ప్రజల్ని చైతన్య పరచాల్సిన అవసరముందన్నారు. సమావేశంలో కవులు వెంకటకృష్ణ, మారుతి, ఎస్‌డీవీ అజీజ్, ఏవీ రెడ్డి, నాగేశ్వరాచారి, కృష్ణయ్య, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో నరసం వార్షికోత్సవం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నరసం సభ్యులు

కర్నూలు కల్చరల్: నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం(నరసం) వార్షికోత్సవాన్ని ఈనెల 12న విజయవాడలో నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి తెలిపారు. గురువారం విద్యానగర్ మాంటిస్సోరి పాఠశాలలో వార్షికోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భాషా సేవకులకు పురస్కారాల ప్రదానం, రచయిత్రుల కవితాగానం ఉంటుందన్నారు.